జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 7-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 610 పేజీలు: 4 వెల : రూ.7

# గురుకులాల్లో.. అవినీతి ఆకలి




* అవినీతికి నిలయాలుగా పలు వసతి గృహాలు
* విద్యార్థినుల కడుపు కొట్టి.. ఇళ్లకు సరుకులు తరలిస్తున్న కొందరు సిబ్బంది
* ఫొటోల కోసం ఓ రకం వంటలు, విద్యార్థినుల కోసం మరో రకం వంటలు
* ముద్ద చట్నీ సిబ్బంది ఇంటికి.. పలుచని చట్నీ విద్యార్థినులకు
* పలాస ఏపీ జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల సిబ్బందిపై విమర్శలు

**పలాస, మార్చి 6 (వార్త):** ఆకలి తీర్చాల్సిన అక్షరాలయాలు.. అవినీతికి నిలయాలవుతున్నాయి. పేద విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం కోట్లు ఖర్చు చేస్తుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అత్యంత దారుణంగా ఉంది. విద్యార్థినులకు కడుపు నింపాల్సిన వారు తమ ఇళ్లకు సరుకులు తరలించి పొట్టనింపేసుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలోని మదర్ థెరిసా స్కూల్ పక్కన ఉన్న 'ఆంధ్రప్రదేశ్ జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల'లో విద్యార్థినుల భోజనం గాలిలో దీపమైంది. సుమారు 250 మంది విద్యార్థినులు ఉన్న ఈ పాఠశాలలో, సిబ్బంది ఆకృత్యాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఇక్కడ మెనూ కేవలం కాగితాలకే పరిమితం. ఉన్నతాధికారులకు పంపే ఫొటోల కోసం ఒక రకమైన వంటకాలు, విద్యార్థినుల ప్లేట్లలోకి వెళ్లేందుకు మరో రకమైన వంటకాలు తయారవుతున్నాయి. అల్పాహారంలో ఇచ్చే చట్నీ చూస్తే కళ్లమ్మట నీళ్లు వస్తాయి. ముద్దగా ఉన్న చట్నీని బాక్సుల్లో సర్దుకుని సిబ్బంది ఇళ్లకు పట్టుకెళ్లిపోతుండగా, మిగిలిన దానిలో రెండు బకెట్ల నీళ్లు కలిపి విద్యార్థినులకు వడ్డిస్తున్నారు. శనివారం వడలు వేస్తే.. మొదటి వాయ మొత్తం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఇళ్లకు చేరిపోవాల్సిందే. విద్యార్థినులకు మిగిలేవి తక్కువ, ఆకలి తీరేది అంతంతే. ప్రభుత్వ పథకం కింద ఇచ్చే పాలు విద్యార్థినుల గ్లాసుల కంటే..





సిబ్బంది ఇళ్లలో కాఫీ గిన్నెలకే ఎక్కువగా చేరుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యాహ్న భోజనంలో కర్రీ చూస్తే అధికారులకు పంపే ఫొటోలో అది గట్టిగా, రుచిగా కనిపిస్తుంది. కానీ విద్యార్థినుల ప్లేట్లలో మాత్రం అది నీళ్ల చారులా మారుతోంది. వారానికి ఐదు రోజులు ఇవ్వాల్సిన గుడ్ల పంపిణీపై బహిరంగ విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని విద్యార్థినుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇక ఆదివారం ఇచ్చే మాంసాహారం, పన్నీరు ఊసే లేదు. అక్కడ ఉన్నది బాలికలు కావడంతో, దేనినీ ప్రశ్నించలేక అన్యాయాన్ని మౌనంగా భరిస్తున్నారు. ఒకవేళ బాలుర పాఠశాల అయి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని, ఆడపిల్లలన్న చులకన భావంతోనే మెస్ సిబ్బంది, కొంతమంది టీచర్లు ఇంతలా తెగబడుతున్నారని తెలుస్తోంది. పలాస వంటి ముఖ్య పట్టణంలోనే పరిస్థితి ఇలా ఉంటే, మారుమూల ప్రాంతాల్లోని గురుకులాల పరిస్థితి ఇంకెంత దారుణమోనని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తనిఖీలు నిర్వహించి ఈ 'మెస్ దోపిడీ'కి అడ్డుకట్ట పడుతుందని విద్యార్థినుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

### విద్యార్థులతో కలిసి..
# కలెక్టర్ భోజనం

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, మార్చి 6 (వార్త):** హిరమండలం మండ లంలోని కోరాడ కాలనీ (సుబలాయి పునరావాస కేంద్రం) జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులపై అడిగి తెలుసు కున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ చిక్కీలను కలెక్టర్ పరిశీ లించారు. ఈ క్రమంలో ఒక ప్యాకెట్ గడువు తీరిపోయినట్లు గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహించినం దుకు గాను పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె.ఎస్తేర్ రాణికి అక్కడి కక్కడే షోకాజ్ నోటీసు జారీ చేశారు. పాఠశాల ఆవ రణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు లక్ష రూపాయలు, అలాగే భద్రతా పరంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 25 వేలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ నిధులను తక్షణమే ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు.






## ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక ఏఎస్ఐ సస్పెన్షన్

* విధి నిర్వహణలో నిర్లక్ష్యం
* ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ

**సోంపేట, మార్చి6 (వార్త):** విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైనం.. సోంపేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక ఏఎస్ఐతో పాటు మరో ఇద్దరు కానిస్టేబుల్స్‌పై క్రమశిక్షణ చర్యలకు దారితీసింది. ఏఎస్ఐ సింహాద్రి, కాని స్టేబుళ్లు విజయ్, మురళిలను విధుల నుండి సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సుమారు రెండు నెలల క్రితం సోంపేట పట్టణంలో చోటుచేసుకున్న ఓ గొడవ పట్ల ఈ ముగ్గురు వ్యవహరించిన తీరు సస్పెన్షన్లకు దారి తీసినట్లు తెలుస్తోంది. ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న గొడవను సము దాయించి అడ్డుకోవాల్సింది పోయి ప్రేక్షకులు మాదిరిగా నిలబడి కొట్లాటను చూస్తూ ఉండి పోయారు. దీన్ని వీడియోగా తీసిన ఓ వ్యక్తి సామా జిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో సదరు వీడియో జిల్లా పోలీస్ బాస్ వరకు వెళ్లింది. దీనిపై అంతర్గత దర్యాప్తు నిర్వహించిన ఎస్పీపై ఈ ముగ్గురి పట్ల సస్పెన్షన్ వేటు వేశారు.

# రెవెన్యూ ముడుపుల పర్వం



* ఎమ్మెల్యే ఆదేశాలకే గండి
* సింగుపురంలో తెగబడ్డ భూబకాసురులు.. ఖరీదైన రహదారి కబ్జా
* సర్వే నెం. 360లో 40 అడుగుల బాట.. 30కే పరిమితం!
* ఎమ్మెల్యే గొండు శంకర్ విజన్‌కు రెవెన్యూ తూట్లు
* సెలవు రోజున మొదలెట్టిన నిర్మాణం.
* చివరకు పని దినాల్లోనూ ఆగని వైనం
* తహశీల్దార్ కనుసన్నల్లోనే సాగుతున్న భాగోతం

**శ్రీకాకుళం, మార్చి 6 (వార్త):** జిల్లాలో భూబకాసురుల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. సాక్షాత్తూ స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ 'ప్రభుత్వ ఆస్తులను, రహదారులను కాపాడాలి' అని గట్టిగా ఆదేశించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం మాత్రం 'ముడుపుల' మత్తులో జోగుతోంది. సింగుపురం గ్రామ పరిధిలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కోట్లాది రూపాయల విలువైన సర్వే నెం. 360లో జరుగుతున్న రహదారి కబ్జా పర్వం ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. సింగుపురంలోని ఈ వివాదాస్పద స్థలంలో 40 అడుగుల వెడల్పున్న రహదారి ఉండాలని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులకు స్పష్టమైన గీత గీశారు. కానీ, స్థానిక తహశీల్దార్ మాత్రం ఎమ్మెల్యే ఆదేశాలను తుంగలో తొక్కి, కబ్జాకోరులకు ఎర్రతివాచీ పరుస్తున్నారు. పట్టాలు ఇవ్వడం ద్వారా పేదలను ఆదుకోవడాన్ని ఎవరూ తప్పు పట్టరు, కానీ జాతీయ రహదారి ముఖద్వారం వద్ద, అది కూడా ప్రతిపాదిత 40 అడుగుల రోడ్డును ఆక్రమించేలా పట్టాలు కేటాయించడం వెనుక ఉన్న మతలబు ఏమిటి? తహశీల్దార్ కి తెలియకుండానే సెలవు రోజుల్లో పిల్లర్లు లేస్తాయా? అని స్థానికులు నిలదీస్తున్నారు.

### కోట్ల విలువైన భూమిపై కబ్జాకోరుల పంజా!

జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ భూమి విలువ గజం వేలల్లో పలుకుతోంది. అలాంటి ఖరీదైన చోట రోడ్డు విస్తీర్ణాన్ని 40 అడుగుల నుండి 30 అడుగులకు కుదించి, మిగిలిన 10 అడుగుల రోడ్డు స్థలాన్ని ఆక్రమించేలా ప్రైవేట్ వ్యక్తులకు ప్రోత్సాహం అందించడం వెనుక పెద్ద ఎత్తున 'చేతులు మారినట్లు' ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం అధికారులెవరూ ఉండరనే అదను చూసుకుని నిర్మాణ పనులు చేపట్టడం చూస్తుంటే, ఇది పక్కా ప్రణాళిక ప్రకారం, రెవెన్యూ శాఖ కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.

### ఎమ్మెల్యే విజన్‌కు అధికారుల అడ్డంకి!

శ్రీకాకుళం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని, భవిష్యత్తులో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా జాతీయ రహదారి ముఖద్వారాలు విశాలంగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ నిరంతరం తపిస్తున్నారు. అయితే, తహశీల్దార్ స్థాయి అధికారులు మాత్రం స్వల్ప ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే కి తప్పుడు సమాచారం ఇస్తూ, భవిష్యత్తు అభివృద్ధికి గొడ్డలి పెట్టులా మారుతున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలను సైతం లెక్కచేయకుండా, కబ్జాకోరులకు కొమ్ముకాస్తున్న తహశీల్దార్, సంబంధిత రెవెన్యూ సిబ్బందిపై ఉన్నత స్థాయి విచారణ జరపాలి. తక్షణమే అక్రమ కట్టడాలను కూల్చివేసి, రికార్డుల్లో ఉన్న 40 అడుగుల రోడ్డును పునరుద్ధరించాలని శ్రీకాకుళం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవినీతి అధికారుల అండతో సాగుతున్న ఈ 'భూ' దౌర్జన్యానికి చరమగీతం పాడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది. ఎమ్మెల్యే గొండు శంకర్ దృష్టికి ఈ పూర్తి స్థాయి అవినీతి భాగోతం వెళ్తే, ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరని, బాధ్యులైన అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ఖాయమని సింగపురం, మామిడి వలస గ్రామస్తులు చెబుతున్నారు.

## డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

**-మద్యం సేవించి వాహనాలు**

**నడిపితే కఠినచర్యలు - పోలీసులు**

**జలుమూరు, మార్చి 6(వార్త):** జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు జలుమూరు మండలంలోని చల్లవానిపేట జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం స్థానిక పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. జలుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఈ తనిఖీ కార్యక్రమం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులను ఆపి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించి వారికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడంతో మీ ప్రాణాలకే గాకుండా, ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జలుమూరు పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు నాగరాజు, వెంకటరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## యువత జీవితం నాశనం చేసుకోవద్దు



**వజ్రపుకొత్తూరు, మార్చి 6 (వార్త):** ఇంటర్నెట్ మోజులో పడి యువత జీవితం నాశనం చేసుకోవద్దని వజ్రపు కొత్తూరు ఎస్ఐ నిహారిక అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఓపెన్ హౌస్‌లో భాగంగా నగరంపల్లి జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళా సాధికారకతపై ప్రత్యేక కార్యక్రమాన్ని పోలీస్ శాఖ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్పు అనేది ఇల్లు, పాఠశాల నుంచే మొదలవ్వాలని తెలిపారు. తల్లిదండ్రులు త్యాగాలు చేసి అన్నీ సమకూర్చుతున్నారని , అమ్మాయిలు అంతే బాధ్యతగా చదివి మేమెవరికీ ఏమీ తీసిపోమని నిరూపించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా మోజులో పడి అనవసరంగా విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.రమణ ఆధ్వర్యంలో నిర్వహించగా ఉపాధ్యాయ సిబ్బంది టి.ఎర్రన్న, కొయ్యాల శ్రీనివాసరావు, టి.కమలకుమారి, పి.గజేంద్ర, బి.చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దాత చొరవతో ప్రహరీకి మోక్షం




**పలాస, మార్చి 6 (వార్త):** శిథిలావస్థకు చేరుకున్న పలాస ఉదయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత ప్రహరీపై పత్రికల్లో, సామాజిక మధ్యమాల్లో వచ్చిన కథనాలకి ఓ దాత స్పందించి, నూతన గోడ నిర్మించారు. ఉదయపురం ఎం.పి.యు.పి స్కూల్ పురాతన గోడ ఏ క్షణానైనా కుప్పకూలి ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందేవారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో కథనాలు రావడంతో రాజాం సురేష్ స్పందించారు. వెంటనే ఆయన ఆ గోడని నిర్మింపజేశారు.




## మెడికవర్ హాస్పిటల్‌లో రక్తదానం

**శ్రీకాకుళం, మార్చి 6 (వార్త):** రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెడికవర్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది రక్తదానం చేశారు. మహిళలకు శనివారం ఉచితంగా ఓపీ నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. 50% రాయితీతో పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ సాగరిక వైద్యులు బలగ రజిని, కె.అమూల్య, కోరారు. కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ అధినేత మణికంఠ, మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు


## అలంకారప్రాయంగా చెత్తకుండీ



**పలాస, మార్చి 6 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు, ఉమారుద్ర నగర్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని స్థానిక ప్రజలంటున్నారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చెత్తకుండీ, ఉపయోగంలోకి రాకుండా నిరుపయోగంగా మారింది. కొన్ని రోజులుగా చెత్త డబ్బా బోర్లాపడి ఉండటమే కాకుండా, దానికి పక్కన ఒక పెద్ద రంధ్రం కూడా ఏర్పడింది. దీంతో స్థానికులు చెత్త వేయడానికి వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చెత్తకుండీని కేవలం ఉత్సవ విగ్రహంలా చూసుకోవడానికే తప్ప, ఉపయోగించడానికి పనికిరాకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త వేసేందుకు సరైన ప్రదేశం లేక, ప్రజలు ఆ డబ్బా పక్కనే చెత్తను పారబోస్తున్నారని స్థానిక ప్రజలు అనుకుంటున్నారు. ఫలితంగా ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపించి, వీధి కుక్కలు, ఆవులు చెత్తను మరింత చిందరవందర చేస్తున్నాయి. ఇది అంటువ్యాధులు ప్రబలడానికి కారణమవుతుందని, ప్రజారోగ్యానికి పెను ముప్పుగా పరిణమించిందని స్థానిక నివాసితులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే ఈ సమస్యపై స్పందించి బోర్లా పడిన చెత్తకుండీని సరి చేయడమో లేదా దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడమో చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం పన్నులు వసూలు చేయడమే కాకుండా, ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**పలాస, మార్చి 6(వార్త):** పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో నిబంధనలో ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఆర్ అప్పలరాజు హెచ్చరించారు. శుక్రవారం ఎరుకోలా సత్యారావు క్రాకర్స్ గోడౌన్ ను డివిజన స్థాయి అధికారులతో పరిశీలించారు. గొడవలలో ఉన్న పేలుడా పదార్థాల భద్రత ఏర్పాట్లు అగ్ని ప్రమాద నివారణ చర్యలు లైసెన్స్ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను ఏ విధంగా ఉన్నాయో పాటిస్తున్నారో అధికారులు పరిశీలించారు. గోదాం యజమాని నిబంధనలు పాటించి, ప్రభుత్వ నిబంధనలకు లోబడి భద్రతపరంగా పాటించాలని, పేలుడు పదార్థాల నిల్వ విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను తూ..చా తప్పకుండా అనుసరించాలని స్పష్టం చేశారు. పరిమితికి మించి పేలుడు పదార్థాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని యజమానిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కళ్యాణ చక్రవర్తి, కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ, కాశిబుగ్గ అగ్నిమాపక శాఖ అధికారి సోమేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, మున్సిపల్ సిబ్బంది, గోడౌన్ యజమాని ఎరుకల సత్యారావు పాల్గొన్నారు.



# ఎవరో వస్తారని..ఏదో చేస్తారని..ఎదురు చూడలేదు!

**-అధికారులు, పాలకుల తీరుతో విసిగి వేసారిన గిరిజనం**

**-శిథిలావస్థ రోడ్డును శ్రమదానంతో బాగు చేసుకున్న వైనం**

**మందస, మార్చి 6(వార్త):** వారంతా సామాన్య పేద గిరిజనులు.. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు.. గిరి సీమల్లో బతుకుతున్న వీరంతా ప్రశ్నించలేరనే ధీమాతో అటు పాలకులు, ఇటు అధికారులు వారిని నిర్లక్ష్యం చేస్తున్నారు.. రోజులు, వారాలు, సంవత్సరాల పాటు తమ సమస్యను ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ ఇంజనీర్లు, అధికారులకు చెప్పి, ఫిర్యాదు చేసి.. విసిగి వేసారి.. చివరకు తమ రోడ్డును తామే బాగు చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని బొగాబంద పంచాయతీలో గల కొయిటాసాయి- వయా అనే గిరిజన గ్రామంతో పాటు ఇతర గ్రామాలను కలిపే రహదారి అధ్వాన్నంగా మారింది. నడవలేని స్థితికి చేరుకుంది. పరిస్థితిని ఐటీడీఏ ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు, పాలకులు, జిల్లా ఉన్నతాధికారులకు చెప్పారు. ఫిర్యాదు చేశారు. పాడైన రోడ్డును బాగు చేయండి మహాప్రభో అంటూ వేడుకున్నారు. అయినా వారిలో ఎటువంటి చలనం లేదు. విద్య, వైద్య, వ్యాపారాలకు ఈ రహదారికి ఎంతో ప్రాధాన్యత ఉండడంతో గిరిజనులు ఏకతాటిపైకి వచ్చారు. శ్రమదానం చేసి, రహదారి బాగు చేసుకోవడానికి నిర్ణయించారు. దీంతో ఏ ప్రభుత్వం వచ్చిన గిరిజనుల తలరాత మారడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ.. మహిళలు, యువకులు ఏకమై రహదారిని బాగు చేశారు. వర్షాలకు ఏర్పడిన గుంతలు పూడ్చారు. పాలకులు తమపై నిర్లక్ష్యం చూపుతున్నారని, తమ ప్రక్కనే ఉన్న ఆంధ్రా-ఒడిశా(ఏఓబీ) ప్రాంతంలో ఒడిశా ప్రభుత్వం రహదారులను వేసి, సర్వాంగసుందరంగా మార్చుతుంటే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం తమ సమస్యలను పట్టించుకోవడంలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. శ్రమదానంతో రహదారిని బాగు చేసుకున్న గిరిజనులను స్థానికులు అభినందిస్తున్నారు.







# 'చంద్రశేఖరుని'కి సముచిత స్థానం

**-కూలీ కుటుంబం నుంచి టీడీపీ లీడర్‌గా ..**

**-మంగళగిరి కార్యాలయంలో మాట్లాడే అవకాశం**

**-'ముంజేటి'ని అభినందిస్తున్న కూటమి నాయకులు**



**మందస, మార్చి 6(వార్త):** ఆయనో సామాన్య వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చారు.. కష్టాలను ఎదుర్కొని రాటుదేలారు.. తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా జీవితం ప్రారంభించారు. అంతకంటే ఎక్కువగా గౌతు కుటుంబానికి వీరవిధేయుడుగానే ఉంటున్నారు.. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఆయన అంచెలంచెలుగా.. దినదినాభివృద్ధి చెందుతున్నారు.. ఆయనే ముంజేటి చంద్రశేఖర్. మందస మండలంలోని జిల్లుండ పంచాయతీలో గల డిమిరియా గ్రామానికి చెందిన చంద్రశేఖర్ సామాన్య వ్యవసాయ కూలీ కుటుంబంలో జన్మించారు. చిన్ననాటి నుంచే కష్టపడే మనస్తత్వం కలిగిన ఆయన శ్రమించి, ఆర్థికాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఓ వైపు కష్టపడుతునే.. మరో వైపు తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. చిన్నప్పుడే మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అడుగుజాడల్లో పయనించారు. అనంతరం గౌతు శిరీషాకు ముఖ్య అనుచరునిగా మారారు. చంద్రశేఖర్ సేవలను పార్టీ గుర్తించింది. అంతేకాదు, క్లస్టర్ కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించింది. పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చంద్రశేఖర్ ముందుకు సాగుతున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు అమరావతిలో జరుగుతున్నాయి. ఈ తరగతులకు ప్రత్యేకంగా చంద్రశేఖర్ కు ఆహ్వానం అందింది. అంతేకాదు.. తరగతుల్లో మాట్లాడే అవకాశం కూడా దక్కింది. టీడీపీ అభివృద్ధికి కష్టపడే కార్యకర్తకు గుర్తింపు లభించడమంటే ఇదేనని ఆ పార్టీ కేడరు చెబుతోంది. కాగా.. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈరోజు నాకు అత్యంత సంతోషకరమైన రోజుగా భావిస్తున్నాను. ఎందుకంటే ఒక వ్యవసాయ కూలీ కొడుకుగా నేను నమ్ముకున్న మా పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి(వీసీ)అన్నయ్య, పలాస నియోజకవర్గ శాసన సభ్యురాలు గౌతు శిరీషా నా నమ్మకంపై మంగళగిరి పార్టీ ఆఫీస్ లో క్లస్టర్ కన్వీనర్ గా శిక్షణ తరగతులకు అవకాశం కల్పించినందుకు చాలా గర్వపడుతున్నాను. అలాగే నా ప్రాణం ఉన్నంతవరకు వారి అడుగుజాడల్లోనే ఉంటానని చెప్పారు.

# భూ కబ్జాలపై ఆర్డీవోకు ఫిర్యాదు!

**పలాస, మార్చి 6 (వార్త):** భూకబ్జాలపై టిడిపి నాయకులు ఆర్డీవో ఆర్ అప్పల్రాజుకు ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందిస్తూ కబ్జాలపై ఫిర్యాదు చేశారు. పలాస నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా ఇటీవల విధుల్లో చేరిన అప్పలరాజుని పట్టణ ముఖ్య నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆయనకు పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం, పట్టణంలో తీవ్రమైన సమస్యగా మారిన ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు మాట్లాడుతూ "నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. అదే సమయంలో మా ప్రాంతంలో జరుగుతున్న తీవ్రమైన అన్యాయాన్ని మీ దృష్టికి తీసుకురావడం మా బాధ్యతని, ఇది సుమారు రూ. 5 కోట్ల విలువైన ప్రజాధనానికి సంబంధించిన విషయం. మీ నాయకత్వంలో ఈ సమస్యకు త్వరితగతిన ఒక పరిష్కారం లభిస్తుందని గట్టిగా ఆశిస్తున్నాము" అని అన్నారు.




### కొత్త అధికారిపైనే ఆశలు

కౌన్సిలర్ ప్రతినిధి జోగ మల్లేశ్వర రావు మాట్లాడుతూ, "నిన్న డిప్యూటీ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశాము. ఈ విషయం యొక్క తీవ్రత దృష్ట్యా, ఉన్నత అధికారిగా మీకు కూడా వినతిపత్రం ఇచ్చి, విచారణను వేగవంతం చేయాలని కోరుతున్నాము" అని తెలిపారు. నాయకుల వినతిని సావధానంగా విన్న ఆర్డీఓ అప్పలరాజు ఈ విషయంపై తగు విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, రాష్ట్ర కళింగ వైశ్య డైరెక్టర్ శ్రీ టంకాల రవిశంకర్ గుప్తా, సీనియర్ నాయకులు మల్లిపెద్ది చిన్ని, 30 వార్డు కౌన్సిలర్ డొక్కరి శంకర్రావు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు తక్షణ సాయం చేయాలి

**జలుమూరు, మార్చి 6(వార్త):** అందవరం పంచాయతీ రామకృష్ణాపురంలో అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దాదాపు పది రోజుల క్రితం రామకృష్ణాపురం గ్రామంలో వాడాన రాజు, వాడాన భోగమ్మ, మారెళ్ల ఎర్రయ్య కుటుంబాల ఇళ్లు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయని ఆయన తెలిపారు. అయితే ఇంతవరకు ప్రభుత్వ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. శుక్రవారం బాధిత కుటుంబాలను కలిసి గ్రామాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కాలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరారు. అలాగే నియోజకవర్గ ఎమ్మెల్యే వెంటనే స్పందించి ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ఇల్లు నిర్మించుకోవడానికి రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాదం వల్ల బాధిత కుటుంబాల జీవనాధారం దెబ్బతిందని, వారు కట్టుబట్టలతోనే మిగిలిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తినడానికి తిండి లేక ఆకలితో అలమటించే పరిస్థితి నెలకొన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నౌపాడు అప్పారావు పాల్గొన్నారు.



## కంబకాయ జంక్షన్ రోడ్డు అధ్వానం



**నరసన్నపేట, మార్చి 6(వార్త):** కంబకాయ జంక్షన్ వద్ద రహదారి అధ్వానంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డంతా ఎక్కడికక్కడ గుంతలు పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల కారణంగా తరచూ చిన్నపాటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. చాలా ఏళ్లుగా ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిందని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి వాహనదారులకు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## బొంతల వీధిలో అపరిశుభ్రత తాండవం



**నరసన్నపేట, మార్చి 6(వార్త):** నరసన్నపేటలోని బొంతల వీధి ప్రాంతంలో అపరిశుభ్ర పరిస్థితులు తీవ్రంగా నెలకొన్నాయి. స్థానికులు వ్యర్థాలను ఆ ప్రాంతంలో వేయడంతో పందులు అక్కడికి చేరి చెత్తను చెల్లాచెదురుగా చేస్తుండటంతో పరిసర ప్రాంతమంతా దుర్గంధంతో నిండిపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల వల్ల దోమల వ్యాప్తి కూడా అధికమై ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. చెత్తను తరచుగా తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరుతున్నారు. అదేవిధంగా బొంతల వీధి, శివనగర్ కాలనీ, బజారు ప్రాంతాల్లో పందుల సంచారం ఎక్కువగా ఉందని, ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టడంతో పాటు పందుల సంచారాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తీర గ్రామాల్లో సోలార్ విద్యుత్ దీపాలు

**నరసన్నపేట, మార్చి 6(వార్త):** పోలాకి మండలం పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటు కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామాల్లో వెలుతురు సమస్యను తగ్గించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం పోలాకి మండలం గుప్పెడుపేట శివారు గ్రామం పెద్ద కోవిరిపేటలో సోలార్ విద్యుత్ లైట్‌ను ఏర్పాటు చేశారు. ఈ లైట్లు ఏర్పాటు కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఒక ప్రైవేట్ కంపెనీ ఈ సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రివేళల్లో వెలుతురు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పల్లెల్లో ప్రశాంతత వెల్లివిరియాలి

**మందస, మార్చి 6(వార్త):** పల్లెల్లో ప్రశాంతత వెల్లివిరియాలనే కాశీబుగ్గ రూరల్ సీఐ పి.తిరుపతిరావు అన్నారు. మందస మండలంలోని బైరి సారంగపురం పంచాయతీ రాధాకృష్ణ పురం గ్రామంలో ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ తిరుపతిరావు మాట్లాడుతూ పల్లెల్లో కక్షలు కార్పన్యాలతో తావు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలని పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు జరుగుతున్నాయని వాటిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుర్తు తెలియని నంబర్లను ఉండి వచ్చే కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు ఏటీఎం ఫోన్ పే లాంటి వివరాలు ఇవ్వకూడదన్నారు. గ్రామాల్లో అపరిచితులు తిరిగాడినట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలని తెలిపారు మహిళా చట్టాలు కఠినంగా ఉన్నాయని వారిన అగౌరు పరచవద్దని హితవు పలికారు. కులవివక్షకు తావు లేకుండా అందరూ ఏకంగా కలిసి జీవించాలని తెలిపారు. మహిళలను అగౌరపరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కె.ఢిల్లేశ్వరరావు ఆర్.లక్ష్మణరావు పాల్గొన్నారు.




-రెచ్చిపోతున్న గ్రావెల్ గద్దలు - చోద్యం చూస్తున్న అధికారులు

# పలాసలో పీజీఎఫ్ హవా

**పలాస, మార్చి 6 (వార్త):** పలాసలో కంకర మాఫియా రెచ్చిపోతున్నారు. వాగులు, గెడ్డ కాలువలు ఏదైనా తవ్వేస్తామంటూ గద్దల్లా వాలిపోతున్నారు. తవ్వుకునే వారికి తవ్వుకున్నంతని కేజీఎఫ్ సినిమా తలపిస్తూ ఇక్కడ పీజీఎఫ్ (పలాస గ్రావెల్ మాఫియా)ని చూపిస్తున్నారు. తర్లకోట గ్రామ పరిధిలో కాటమ్మ తల్లి ఆలయానికి దగ్గరలో, లొద్దబద్ర పంచాయతీ లొద్దభద్ర నుంచి మహాదేవిపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో రోడ్డు పక్కన యథేచ్ఛగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. రెండు రోజుల నుంచి అర్ధరాత్రి సమయంలో కొండలను పిండి చేస్తూ అక్రమంగా గ్రావెల్ తరలిస్తోంది ఈ మాఫియా. అనుమతులు లేకుండా భారీ యంత్రాలను ఉపయోగించి అక్రమంగా మైనింగ్ చేస్తూ ట్రిప్పర్లతో గ్రావెల్ ఎత్తుకెళ్లిపోతున్నారు. కొండలను పిండి చేసి పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నా..అధికారులు చోద్యం చూస్తున్నారు. అధికార యంత్రాంగం ప్రకటనలకు పరిమితం కావడంతో పలాసలో మమ్మల్ని ఎవడ్రా ఆపేదంటూ గ్రావెల్ మాఫియా వ్యవహరిస్తోంది.




## గొటివాడ పాఠశాలలో అక్షరాభ్యాస్యాలు



**జలుమూరు, మార్చి 6(వార్త):** గొటివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్ఎం అనసూయ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తగా చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలల బలోపేతం కోసం ఇటీవల గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరినట్లు ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో ఏడుగురు చిన్నారులు పాఠశాలలో చేరడంతో వారికి సామూహికంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ యోజన కిట్లు రాక



**నరసన్నపేట, మార్చి 6(వార్త):** నరసన్నపేట ప్రధాన పోస్ట్ ఆఫీసుకు పీఎం విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా సాంప్రదాయ వృత్తుల వారికి అందజేయాల్సిన కిట్లు చేరాయని బ్రాంచ్ పోస్టుమాస్టర్ రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక పోస్టాఫీసులో ఆయన మాట్లాడుతూ, ఈ పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులకు సంబంధించి ఇప్పటివరకు 40 కిట్లు వచ్చాయని చెప్పారు. ఆయా సాంప్రదాయ వృత్తుల వారికి అవసరమైన పనిముట్లతో కూడిన ఈ కిట్లను క్రమంగా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా సాంప్రదాయ వృత్తిదారులకు ఆర్థికంగా, వృత్తి పరంగా మద్దతు లభిస్తుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులు పోస్టాఫీసుకు వచ్చి తమ కిట్లను స్వీకరించుకోవాలని ఆయన సూచించారు.

## ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్



**జలుమూరు, మార్చి 6(వార్త):** ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి. వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం జలుమూరు మండలం శ్రీముఖలింగం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఇప్పటివరకు జరిగిన చెల్లింపుల వివరాలను స్థానిక పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా బకాయిలుగా ఉన్న ఇంటి పన్నులపై డిమాండ్ నోటీసులు జారీ చేసి వసూలు చేయాలని సూచించారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన ఇంటి పన్ను బకాయిలను సమయానికి చెల్లిస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ కార్యనిర్వాహణాధికారి డి. సత్యనారాయణ పేర్కొన్నారు. శ్రీముఖలింగం గ్రామంలో ఇంటి పన్నులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ. బి. చిన్నముడు, సచివాలయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సెస్ విడుదల చేయాలి



**పోలాకి, మార్చి 6(వార్త):** జిల్లా గ్రంథాలయాల సంస్థకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సెస్‌ను వెంటనే విడుదల చేసి గ్రంథాలయ అధికారులను, విశ్రాంత గ్రంథాలయ అధికారులను ఆదుకోవాలని సంఘాల నాయకుడు సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం ఆయన పోలాకి ఎంపీడీవో జి. రవికుమార్‌కు దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెస్ విడుదల కాకపోవడం వల్ల విశ్రాంత గ్రంథాలయ అధికారులకు పెన్షన్లు అందడం లేదని, అలాగే గ్రంథాలయాల అభివృద్ధి కూడా కుంటుపడుతోందని తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సెస్‌ను జిల్లా గ్రంథాలయాల సంస్థ వెంటనే విడుదల చేసి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**నరసన్నపేట, మార్చి 6(వార్త):** నరసన్నపేట మండలంలో ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 1268 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని, వారి కోసం 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించబడతాయని వివరించారు. విద్యార్థులు పరీక్షలకు కనీసం అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.



## నిరుపేద వివాహానికి ఆర్థికసాయం



**ఇచ్ఛాపురం, మార్చి 6(వార్త):** సన్యాశిపుట్టుగలో నివాసం ఉంటున్న నిరు పేద కుటుంబానికి చెందిన ఏదురు సోమేశ్వరి కుమార్తె వివాహం సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆర్థిక సాయం రూ.52501లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వితరణ



**ఇచ్ఛాపురం, మార్చి 6(వార్త):** సేవక్ ఎడ్యుకేషనల్ గ్రూప్ నీలాపుపుట్టుగ స్కూల్లో చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థులకు , సన్యాసిపుట్టుగ స్కూలు లోని నలుగురు పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు,స్కేల్ లు పరీక్ష అట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సేవక్ గ్రూప్ సభ్యులు వెంకటేష్, గణేష్, నీలాద్రి, నరేంద్ర పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వైభవం



**సోంపేట మార్చి 6(వార్త):** సోంపేటలో శ్రీ సత్యనారాయణ స్వామి వారి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం వైభవంగా జరుగుతోంది. మూడు రోజులు నిర్వహించే ఈ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభించారు. ఉదయం నుంచి గణపతి పూజ మొదలుకొని అనేక ఆధ్యాత్మిక పూజ కార్యక్ర మాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. సాయం త్రం నుంచి టీటీడీ జిల్లా ఆస్థాన గాయకులు వైశ్య రాజు వెంకట రఘురామ రాజు ఆధ్వర్యంలో వారి శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతకు ముందు ఆలయం ఆవరణలో గోపూజా, అన్నప్రాసన తదితర కార్యక్రమాలు కనులపండువుగా జరిగాయి.

### నేడు శోభాయాత్ర :

పుష్పయాగంతో కూడిన స్వామివారి శోభాయాత్ర శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి స్వామివారి తిరువీధి కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పేర్కొన్నారు. సాయంత్రం ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు సౌజన్యంతో శాస్త్రీయ సంగీత గాన కచేరి నిర్వహించనున్నారు.




# జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

### -రైతాంగ సమస్యల సాధన కమిటీ డిమాండ్



**మందస, మార్చి 6(వార్త):** జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మందస మండలంలోని హరిపురం మార్పు ట్రస్టు గ్రంధాలయంలో రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు అధ్యక్షతన శుక్రవారం జీడి పిక్కల గిట్టుబాటు ధరకై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జీడి పంట పూత, పిందె దశలో ఉన్నందున వ్యవసాయ, ఉద్యానవన అధికారులు ఉద్దాన జీడి రైతాంగానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కలుగ జేసుకుని చీడ పీడలను గుర్తించి అవసరమైన చోట క్రిమిసంహారక మందులను, పిచికారి యంత్రాలను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. రైతాంగ అవసరాలు తక్షణమే పరిష్కరించాలని సమావేశానికి హాజరైన రైతాంగ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం జీడి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చలన్నారు. తక్షణమే వ్యవసాయ శాఖ మంత్రి కలుగజేసుకుని మద్దతు ధర కల్పించి పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైన జీడి రైతాంగ సమస్యలు పరిష్కారం కానందున ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్తామని, పరిష్కరమైనంత వరకు పోరాడతామని రైతాంగ కమిటీ సభ్యులు తెలిపారు. 80కేజీల జీడిపిక్కల బస్తా రూ.18,000లకు కొనుగోలు చేయాలని, జీడి పంటకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చెయ్యాలన్నారు. జీడి, కొబ్బరి పంటలకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చెయ్యాలన్నారు. వంశధార ఎడమ కాలువను అనుసంధానం చేస్తూ ఇచ్చాపురం వరకు పొడిగించాలన్నారు. రైతాంగానికి ఎరువులు,పురుగు మందులు, పిచికారి యంత్రాలను, వ్యవసాయ పనిముట్లను 50శాతం సబ్సిడీపై అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతాంగ సమస్యల సాధన కమిటీ అధ్యక్షుడు అధ్యక్షుడు మామిడి మాధవరావు, రైతు సంఘాల నాయకులు గొర్లె చలపతి, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, కొర్ల హేమరావుచౌదరి, పి.దుర్యోధన, కొమర వాసు, కామేశ్వర రావు, కె.తవిటయ్య, నల్ల హడ్డి, బి.సింహాద్రి, ఎం.ధర్మారావు, డి.వీరాస్వామి, ఆర్.చిన్నారావు, నాగమణి, ధనలక్ష్మి, పురుషోత్తం, లింగమూర్తి, టి.గంగయ్య, పలువురు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జేసీఐ జాతీయ ఉపాధ్యక్షుడి పర్యటన




**ఇచ్ఛాపురం, మార్చి 6(వార్త):** జేసీఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యక్షుడు జెఎఫ్ఎస్ రాకేష్ నాయర్ (జోన్--4) తొలి అధికారిక పర్యటన సందర్భంగాఘనంగా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వి.జె గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో, జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షుడు జేసీ బోయిన శ్రవణ్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థ సభ్యులు నాన్ జేసీలు పాల్గొన్నారు.కార్యక్రమం ప్రారంభంలో జాతీయ ఉపాధ్యక్షుడు జెఎఫ్ఎస్ రాకేష్ నాయర్ తో మీట్, గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సభ్యులు ఆయనతో పరస్పరంగా చర్చలు జరిపే అవకాశం పొందారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమంగా “సస్టైనబుల్ సిప్పింగ్” పేరుతో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే ఉద్దేశంతో ఆటో డ్రైవర్లకు 100 స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌లో “సస్టైనబుల్ కిచెన్ ప్రాజెక్ట్ -- 500 మంది విద్యార్థులకు పోషకాహారం అందించే బ్రైటర్ ఫ్యూచర్” అనే ప్రాజెక్ట్‌కు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్‌ను జాతీయ ఉపాధ్యక్షుడు జెఎఫ్ఎస్ రాకేష్ నాయర్ , అధ్యక్షుడు బోయిన శ్రవణ్ తల్లిదండ్రులు బోయిన వెంకటరమణ జయలక్ష్మి లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జోన్ ప్రెసిడెంట్ ఆర్‌పిపి చైతన్య వసంతవాడ, జోన్ వైస్ ప్రెసిడెంట్ హెచ్‌జిఎఫ్ ఈశ్వర్, టూర్ కోఆర్డినేటర్ జెఎఫ్ఎస్ రాజీవ్ చైతన్య హాజరయ్యారు. జేఎఫ్ఎం తంగుడు శణ్ముఖ్, హెచ్‌జిఎఫ్ జేసీ కల్లా జైదేవ్, జేసీ సంతోష్ సాహు, ఎల్ఓ అడ్వైజర్ దినేష్, జేసీ శ్రావ్య, జేసీ దిల్లేష్, జేసీ నవీన్, జేసీ సిరీషా దాస్, జేసీ చ్ రేణుక, జేసీ అభిలాష్, జేసీ రాజ్ కమల్, జేసీ మట్టా శ్రీనివాస్, జేసీ యు. శేషు యాదవ్, జేసీ యు. శ్యామ్ తదితర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యుల జేసీఐ ఇండియాకు చేసిన విరాళాల ద్వారా ప్రత్యేక గుర్తింపులు కూడా లభించాయి.జేసీ పైడిసెట్టి దినేష్ జేసీఐ ఇండియాకు విరాళం అందించి “సెనేటర్”గా గుర్తింపు పొందారు. జేఎఫ్ఎం తంగుడు శణ్ముఖ్ జేసీఐ ఇండియాకు విరాళం అందించి “జేఎఫ్‌డీ”గా గుర్తింపు పొందారు. హెచ్‌జిఎఫ్ కాళ్ల జైదేవ్ జేసీఐ ఇండియాకు విరాళం అందించి “జేఎఫ్ఎం”గా గుర్తింపు పొందారు.

## కొబ్బరి పరిశ్రమకు చేయూత

**ఇచ్ఛాపురం, మార్చి 6 (వార్త):** చికాకోల్ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ , కవిటి ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం జ్ఞాన భారతి స్కూల్లో వెబ్ నార్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయము గ్రామీణ మార్పు అనే అంశంపై కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ పోస్ట్ బడ్జెట్ వేబినార్ ( ఆన్లైన్ పోర్టల్ ద్వారా) నిర్వహించింది. ఈ వేబినార్ కొబ్బరి ,జీడిపప్పు ,చందనం తదితర పంటల సామర్థ్యాన్ని వెలికి తీసి అధిక విలువ గల వ్యవసాయాన్ని ప్రోత్సహించడం పై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ వేబినార్లో పాల్గొనేందుకుచికాకోల్ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కవిటి - ఇచ్చాపురం కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ వెభినార్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభ ఉపన్యాసాన్ని అందించారు. వివిధ రకాల వ్యవసాయాల అభివృద్ధికి, ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా కొబ్బరి పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో మాట్లాడారు.చికాకోల్ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ కవిటి - ఇచ్చాపురం తరపున కూడా పలు సమస్యలను నివేదిక రూపంలో అందించారు. ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఉద్దానం ప్రాంతంలో కోకోనట్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతూ సమగ్ర నివేదికను అధికారులకు ఈ వెబ్ నార్ వేదికగా అధికారులకు అందజేశారు. స్థానికంగా ఉన్న కొబ్బరి పరిశ్రమ కొబ్బరి రైతుల స్థితిగతులు కొబ్బరి రైతుకు కావలసిన ప్రోత్సాహం గూర్చి వివరించారు. కోకోనట్ పార్క్ ఏర్పాటు ద్వారా రోజుకు లక్ష కొబ్బరికాయలను, ఏడాదికి మూడు కోట్ల కొబ్బరికాయలను ప్రాసెస్ చేయగలుగుతామని, తద్వారా కొబ్బరి రైతులకు ఎంతో ఉపయోగ కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమం లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చికాకోల్ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ జోహార్ ఖాన్, వైస్ చైర్మన్లు బొర్రా వెంకటరమణ, గొండ్యాల భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ ఆరంగి శివాజీ, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్లు గోనపరాజు, డైరెక్టర్ లోల సురేంద్రనాథ్, బొడ్డ చంద్రశేఖర్, బంజు మోహన్ రావు, సిపాన కృష్ణారావు పాల్గొన్నారు.





## ఆఫ్‌షోర్ పనులు పరిశీలించిన కలెక్టర్

**మెళియాపుట్టి, మార్చి 6(వార్త):** ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ద్వారా జరుగుతున్న వివిధ పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ దినకర్ శుక్ర వారం నాడు సందర్శించి పరిశీలించారు. చాపర గ్రామం వద్ద ఆఫ్ ఫ్లోర్ రిజర్వాయర్ వరద కాలువ పనులకు సంబంధించి సంబంధించి జరుగుతున్న పనుల పరిశీలనతో పాటు పట్టుపురం జోడూరు అచ్చినాపురం గ్రామాల్లో జరుగుతున్న కాలువ పనులను ఆకస్మికంగా సంద ర్శించి పరిశీలించారు ఇక్కడ పనులకు సంబంధించి సంబంధిత శాఖ అధికారులతో వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భనలో వంశధార ఈఈ శేఖర్, తహసీల్దార్ పాపారావు, సీనియర్ సహాయకులు ఎస్వీజే మోహనరావు, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.




## మహిళ దినోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ

**శ్రీకాకుళం, మార్చి 6(వార్త):** భారత ప్రభుత్వం యువజన వ్యవహారములు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ మేరా యువ భారత్ మరియు జిల్లా క్రీడా సాధికారిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోడి రామ్మూర్తి స్టేడియంలో అస్మిత అథ్లెటిక్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## నిరుద్యోగులకు వరం..
## జేఎన్‌టీయూ- జీవీ 'అవకాశాల పోర్టల్'

**శ్రీకాకుళం, మార్చి 6(వార్త):** నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు విజయనగరం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ-జీవీ) నడుం బిగించింది. 'నిర్మాణ్' సంస్థతో కలిసి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని యువత కోసం ప్రత్యేకంగా 'అవకాశాల పోర్టల్' ను ప్రారంభించింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. జయసుమ ఉత్తర్వులు జారీ చేస్తూ, ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతూ విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. ఈ పోర్టల్ కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకే పరిమితం కాకుండా.. ఎంబీఏ, ఎంసీఏ, ఎం.ఫార్మసీ, బీటెక్, బీ.ఫార్మసీ వంటి ప్రొఫెషనల్ కోర్సులతో పాటు బీఎస్సీ, బీకామ్, బీబీఏ, బీబీఎం, డిప్లొమా, ఐటీఐ (పాస్ లేదా ఫెయిల్) చదివిన వారందరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి నెలా ధ్రువీకరించబడిన ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని ఈ పోర్టల్ ద్వారా నిరుద్యోగులకు అందిస్తారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ సచివాలయాలు, మండల ఆఫీసులు, ఉపాధి కార్యాలయాల ద్వారా ఈ పోర్టల్ గురించి యువతకు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నట్లు రిజిస్ట్రార్ చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు uyopportunities.jntugv.edu.in వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు

## వాయుసేనలో కొలువులకు 'అగ్నివీర్'

* గుంటూరులో 9, 12 తేదీల్లో రిక్రూట్‌మెంట్ ర్యాలీ
* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




**శ్రీకాకుళం, మార్చి 6(వార్త):** భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీకి నిర్వహించనున్న ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిరుద్యోగ యువతకు ఒక సువర్ణావకాశమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ నెల 9, 12వ తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా ఈ ఎంపిక ప్రక్రియ జరగనుంది. అభ్యర్థులు ముందస్తుగా ఎలాంటి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, అర్హత కలిగిన వారు నేరుగా ర్యాలీకి హాజరుకావచ్చని ఆయన పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 6 గంటల నుండి 10 గంటల లోపు అభ్యర్థులు రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఈ నెల 9న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మహిళా అభ్యర్థులకు, 12న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పురుష అభ్యర్థులకు ఎంపికలు నిర్వహిస్తారు. అభ్యర్థులు 02.07.2005 నుండి 02.01.2009 మధ్య జన్మించి ఉండాలని, కనీసం 152 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలని కలెక్టర్ వివరించారు. ఇంటర్మీడియట్ లేదా డిప్లొమా లేదా ఒకేషనల్ కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులు, అలాగే ఇంగ్లీష్ సబ్జెక్టులో తప్పనిసరిగా 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. 49.99 శాతం మార్కులు ఉన్నా కూడా అనర్హులుగా పరిగణిస్తారని ఆయన గుర్తు చేశారు. ర్యాలీకి వచ్చే అభ్యర్థులు తమ వెంట విద్యార్హత ధ్రువపత్రాల ఒరిజినల్స్‌తో పాటు, ఆధార్ కార్డు, డొమిసైల్ సర్టిఫికేట్, ఎన్సీసీ (ఉంటే), 10 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ప్రతి సర్టిఫికేట్ యొక్క ఆరు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. దేశ సేవలో భాగస్వాములు కావాలనుకునే ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆకాంక్షించారు.

## కానిస్టేబుళ్లకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై
## అవగాహన శిక్షణ

**శ్రీకాకుళం, మార్చి 6(వార్త):** జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పోలీసు మొబిలైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల మండలం ఎచ్చెర్లలో ఉన్న ఆర్మ్డ్ రిజర్వ్ ఫోర్స్ కార్యాలయ ఆవరణలో ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు కానిస్టేబుళ్లకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆర్మ్డ్ రిజర్వ్ ఫోర్స్ డీఎస్పీ ఎల్ శేషాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటంలో ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరికి అవగాహన చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి పోలీసు సిబ్బంది ప్రథమ చికిత్స పద్ధతులపై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించి ప్రాణ నష్టాన్ని తగ్గించగలరని పేర్కొన్నారు. పోలీస్ యూనిట్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన సమయంలో తక్షణ సహాయం అందించడం ద్వారా గాయపడిన వ్యక్తుల ప్రాణాలను రక్షించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స పద్ధతులపై సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖకు చెందిన రిసోర్స్ పర్సన్స్ కె. సత్యనారాయణ, పి. చైతన్య కుమార్ పాల్గొని ప్రథమ చికిత్స పద్ధతులుకృత్రిమ శ్వాస అందించడం,గాయపడిన వారిని సురక్షితంగా తరలించే విధానాలు, సీపీఆర్ చేయు విధానం, యాంటీ షాక్ పొజిషన్ వంటి ముఖ్య అంశాలపై ప్రాక్టికల్ డెమోతో కూడిన శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఐ శ్రీనివాసరావు పోలీసు కానిస్టేబుళ్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.




# ఏప్రిల్ నాటికి వంశధార ఎత్తిపోతలు పూర్తి

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * జలాశయం నిర్మాణ పనుల పరిశీలన

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, మార్చి 6 (వార్త):** గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి, రానున్న ఏప్రిల్ నాటికి పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుం టున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన హీరమండలం మండలంలో పర్యటించి, జలాశయానికి నీటిని తరలించే ఎత్తిపోతల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకానికి సంబంధించిన విద్యుత్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, జలాశయం భవిష్యత్తులో జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా, హీరమండలం జలాశయ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన వెల్లడించారు. జలాశయం ద్వారా ఉద్దాన ప్రాంతంతో పాటు పలు నియోజకవర్గాలకు శాశ్వత మంచినీటి పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాలకు సాగు, మంచినీటి లభ్యత పెరుగుతుందని వివరించారు. ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు.



### మహేంద్రతనయ నీటితో 11 గ్రామాలకు మేలు

**పాతపట్నం, మార్చి 6 (వార్త):** మహేంద్రతనయ నదిపై ప్రతిపాదించిన తామర ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 11 గ్రామాల్లోని 3,850 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పాతపట్నం మండలంలో పర్యటించి, తామర ఎత్తిపోతల పథకం నిర్మాణ ప్రాంతాన్ని, మహేంద్రతనయ నది పరివాహక ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ఈ ఎత్తిపోతల పథకాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా ప్రధానంగా పెద్ద సున్నాపురం, తామర, తీమర, సీది, మాకివలసతో పాటు మొత్తం 11 గ్రామాల రైతులకు శాశ్వత ప్రాతిపదికన సాగునీటి సౌకర్యం లభిస్తుందని కలెక్టర్ వివరించారు. మహేంద్రతనయ నది నుంచి నీటిని సమర్థవంతంగా మళ్లించడం ద్వారా ఆయా గ్రామాల్లోని భూములు సస్యశ్యామలం అవుతాయని, ఇందుకు సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి త్వరితగతిన నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేసి రైతులకు సాగునీటి భరోసా కల్పిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.





# పైపులైన్ల లీకేజీలు అరికట్టండి

* జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ * తాగునీటి సరఫరాపై జేసీ ఆకస్మిక తనిఖీలు
* అసిస్టెంట్ కలెక్టర్‌తో కలిసి పంప్ హౌస్‌లు, వాటర్ వర్క్స్ పరిశీలన

**శ్రీకాకుళం, మార్చి 6(వార్త):** శ్రీకాకుళం నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయడమే లక్ష్యంగా జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ తో కలిసి ఏఎస్ఎన్ కాలనీలోని పంప్ హౌస్‌ను సందర్శించిన ఆయన, అక్కడి నీటి నిల్వలు, సరఫరా తీరును పరిశీలించారు. అనంతరం ఆదివారంపేటలోని వాటర్ వర్క్స్ ప్లాంట్‌ను తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న తాగునీటి నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా బలగలోని హెడ్ వాటర్ వర్క్స్ విభాగాన్ని సందర్శించిన జేసీ, నీటి శుద్ధీకరణ ప్రక్రియను, క్లోరినేషన్ స్థాయిలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ల లీకేజీలను తక్షణమే అరికట్టాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రాండ్ హోటల్ జంక్షన్, ప్రభాకర్ నగర్ ప్రాంతాలలో పర్యటించి, పారిశుధ్య పనుల నిర్వహణను స్వయంగా పర్యవేక్షించారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా పూడికతీత పనులు వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా నగరంలోని ప్రతి నీటి వనరు వద్ద పరిశుభ్రత పాటించాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని, నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నగరపాలక సంస్థ అధికారులు, ప్రజారోగ్య విభాగం సిబ్బంది ఉన్నారు.





### 46.5 టన్నుల వ్యర్థాల తొలగింపు

శ్రీకాకుళం నగరవాసులకు సురక్షితమైన తాగునీటి సరఫరాను అందించడమే గాకుండా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడమే లక్ష్యంగా జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ తో కలిసి ఏఎస్ఎన్ కాలనీ, ఆదివారంపేట, బలగ ప్రాంతాల్లోని వాటర్ వర్క్స్, పంప్ హౌస్‌లను సందర్శించిన ఆయన, నీటి శుద్ధీకరణ, క్లోరినేషన్ ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రాండ్ హోటల్ జంక్షన్, ప్రభాకర్ నగర్ వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నగరపాలక సంస్థ విడుదల చేసిన శుక్రవారం నాటి నివేదిక ప్రకారం, నగర ప్రక్షాళన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈరోజు పారిశుధ్య పనుల కోసం 6 ట్రాక్టర్లను నియోగించి, 26 ట్రిప్పుల ద్వారా మొత్తం 29 టన్నుల పూడిక, 17.5 టన్నుల చెత్తను కలిపి మొత్తం 46.5 టన్నుల వ్యర్థాలను నగర వెలుపలికి తరలించారు. మురుగు నీరు సాఫీగా వెళ్లేలా సుమారు 1.223 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడికను పూర్తిస్థాయిలో తొలగించి శుభ్రం చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా తాగునీటి నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పైపులైన్ల లీకేజీలను తక్షణమే అరికటాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర ప్రజలకు మెరుగైన సేవలందించడమే ధ్యేయంగా యంత్రాంగం నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించండి

* మహేంద్రతనయ నదిపై బ్రిడ్జి నిర్మించాలి
* గిరి ప్రాంతాలకు రహదారి సదుపాయం కల్పించాలి
* డిప్యూటీ సీఎంను కోరిన పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్

**పాతపట్నం, మార్చి 6 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పాతపట్నం మేజర్ పంచాయితీ పరిధిలోని కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం హేమ్లెట్ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను వివరించారు. మహేంద్ర తనయ నది వర్షాకాలంలో ఉప్పొంగినప్పుడు ప్రస్తుతం ఉన్న కాజ్‌వే పూర్తిగా మునిగిపోవడంతో ప్రజలు, విద్యార్థులు రైల్వే బ్రిడ్జిపై ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోందని తెలియజేశారు. కాజ్‌వే స్థానంలో నూతన హెవీ బ్రిడ్జి నిర్మాణం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాతపట్నం మండలం బూరగాం గ్రామ రైతులు మహేంద్ర తనయ నది అవతల వైపున ఉన్న తమ వ్యవసాయ భూములలో పంటలు పండించి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతూ గిట్టుబాటు ధరలు పొందలేక నష్టపోతున్నారని వివరించి, రైతుల చిరకాల వాంఛ అయిన బూరగాం గ్రామానికి నూతన బ్రిడ్జి నిర్మాణం మంజూరు చేయాలని కోరారు. పాతపట్నం మండలం బి.గోపాలపురం గ్రామానికి కాజ్‌వే మంజూరు చేయాలన్నారు. కొత్తూరు మండలంలోని గిరిజన ప్రాంతాలకు త్వరితగతిన రహదారి సౌకర్యాలు కల్పించాలని డిప్యూటీ ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. దీనికి డిప్యూటీ సీఎం స్పందించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546